కాపాడేవారు లేరా..?

- ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో వెలుస్తున్న వెంచర్లు, సంస్థలు, ఇళ్లు
- గాలికొదిలేసిన యంత్రాంగం

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

ప్రభుత్వ స్థలంలో ఎవరైనా పేదలు గుడిసె వేసుకుంటే నానా హంగామా చేసే అధికారులు వాటిని కూల్చేవరకు ఊరుకోరు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణే తమ కర్తవ్యమంటారు. బడాబాబులు, రాజకీయ నేతల అనుచరులు ఏకంగా ఎకరాల కొద్దీ భూములు ఆక్రమిస్తున్నా పట్టించుకోరు. ఒకవేళ కట్టడికి ముందుకు కదిలినా ఎక్కడికక్కడ నేతలు వారిని అడ్డుకుంటారు.

– సాక్షి,సిటీబ్యూరో

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 11,384 ఎకరాల అసైన్డ్ భూములు, 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా వాటికి రక్షణ లేకపోవడంతో అన్యాక్రాంతమవుతున్నాయి. ఇప్పటికే సగం భూములు ఆక్రమణకు గురై వెంచర్లు, విల్లాలు, ఇండిపెండెంట్ ఇళ్లు, పలు సంస్థలుగా మారటంతో వాటిని స్వాధీనం చేసుకోవటం కష్ట తరమవుతోంది. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఉన్న కొద్ది పాటి భూములకైనా ఫెన్సింగ్, బోర్డులు లేక పోవటంతో.. భూకబ్జాదారులు నకిలీ పత్రాలు సృష్టించి యథేచ్ఛగా వాటిని ఆక్రమిస్తున్నారు. అలాగే, చెరువులు, కుంటల బఫర్ జోన్లు, శిఖం భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై కూడా రెవెన్యూ అధికార యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం వారికి వరంగా మారుతోంది.

కబ్జాల పర్వం ఇలా...

కాప్రా మున్సిపల్ సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్ 199/1 జమ్మిగడ్డలోని స్టేడియానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి, ప్లాట్లు చేసి, ఇళ్లు నిర్మించి రూ.15 నుంచి రూ.20 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు.

- ఓల్డ్ మల్లాపూర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీకి ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 24లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు సన్నాహాలు చేపట్టారు.
- కీసర గ్రామంలోని సర్వే నంబర్ 131లో 105.26 ఎకరాల ఫారెస్టు భూమి ఉండగా, ఓ వ్యక్తి దొంగ కాగితాలను సృష్టించి... 2 ఎకరాల స్థలంలో బండరాళ్లను పగులగొట్టి, స్థలాన్ని చదును చేసి, భవన నిర్మాణ పనులు ప్రారంభించినా ఫారెస్టు , రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవటం లేదు. ఈ భూకబ్జాపై స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- కీసర రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 825లో 7.08 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల కబ్జాలో ఉండగా, అదే ప్రాంతంలోని 181 సర్వే నంబరులోని 2 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.
- బోడుప్పల్ పరిధిలోని సర్వే నంబరు 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, 1974 నుంచి ఆక్రమణకు గురవుతోంది. అప్పట్లో బోడుప్పల్ గ్రామ పంచాయతీగా ఉండటంతో ఓ భూకబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ జీపీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు విక్రయించాడు. ప్రస్తుతం అదే ప్రభుత్వ స్థలాన్ని స్థానిక రాజకీయ నాయకులతో కలిసి గజం రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు.
- బోడుప్పల్‌లో పార్కు, శ్మశాన వాటికకు చెందిన 2611 గజాల స్థలంతోపాటు అక్షయ నగర్‌లో 509 గజాలు, వెంకటేశ్వర్‌నగర్‌లో 350 గజాల పార్కుల స్థలం అన్యాక్రాంతమవుతోంది.
- పీర్జాదిగూడలోని 13 కాలనీల్లోని 3 ఎకరాల పార్కుల స్థలాలు కూడా కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. చెంగిచర్ల చింతల కుంట చెరువు కట్ట సంబంధించిన భూముల్లో అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.



- దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని అహ్మద్ గూడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 51లో రెండెకరాలు. సర్వే నంబర్ 504లో 3.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. సర్వే నంబర్ 22లో పార్కు స్థలం కబ్జాకు గురైంది. దమ్మాయిగూడలోని సర్వే నంబర్లు 530లో 2 ఎకరాలు , 574లో 2.13 ఎకరాలు, బండ్లగూడలోని సర్వేనంబర్74లో అన్యాక్రాంతమయ్యాయి.
- నాగారంలోని 297 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా... రెవెన్యూ శాఖలో చలనం రావడం లేదు. ప్రధాన రోడ్డుకు అనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములకు కబ్జాకు గురయ్యాయి.
- చీర్యాల గ్రామంలోని సర్వేనంబర్ 7,8లలో 12.5 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. ఇదే రెవెన్యూ గ్రామంలో సర్వేనంబర్ 152/2లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి విక్రయించారు.
- గాగిల్లాపూర్‌లోని 214 సర్వే నంబరులో 57 ఎకరాల అసైన్డ్ భూమిలో 40 ఎకరాలు, డి.పోచంపల్లిలో 120 సర్వే నంబరులో 152 ఎకరాల అసైన్డ్ భూమిలో 60 ఎకరాలు కబ్జా గురైనట్లు తెలుస్తోంది.
- నిజాంపేటలోని 332, 233, 334 సర్వే నంబర్లలోని 300 ఎకరాల్లో సగం భూములను కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నారు.
- గాజుల రామారంలోని సర్వే నంబర్లు 307, 329,79,307లలోని 30 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా గురైనా పట్టించుకునేవారు లేరు.
- శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాలకు పక్కనున్న 10 ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా రెవెన్యూ అధికారుల్లో స్పందన లేదు.
- జవహర్‌నగర్‌లో దాదాపు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఇందులో ప్రైవేట్ ఆసుపత్రితోపాటు ఇతర సంస్థల నిర్మాణాలు కూడా చేపట్టారు.
- ఘట్కేసర్, కాచగాని సింగారం, చౌదరిగూడ ,ప్రతాప్ సింగారం, పీర్జాదిగూడ, పర్వాతాపూర్, మేడిపల్లి, పోచారం ప్రాంతాల్లోనూ వందలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జాకు గురైనట్లు అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు అందుతున్నా... పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డబ్బుతో పరాచికాలు ఆడితే ఏమౌతుంది..?



లక్ష్మీ కటాక్షం పుస్తకంపై చర్చ

సాక్షి, సిటీబ్యూరో: డబ్బును గౌరవించాలే తప్ప పరాచికాలు ఆడితే కోలుకోని దెబ్బ కొడుతుంది అని లక్ష్మీ కటాక్షం పుస్తక రచయిత, ఆర్‌టీఐ మాజీ కమిషనర్ బుద్దా మురళి అన్నారు. కూకట్ పల్లిలోని కెఎస్‌పి ట్రేడింగ్ కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లో లక్ష్మీ కటాక్షం పుస్తకంపై బుధవారం చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ సినీ నటులు కాంతారావు, సావిత్రి, చిత్తూరు నాగయ్య, కస్తూరి శివరావు, రాజబాబు, రాజనాల, గిరిజ వంటి హేమాహేమీలు సైతం ఒకప్పుడు రాజభోగాలు అనుభవించి చివరి దశలో దుర్భర జీవితం గడిపారని తెలిపారు. నటులే కాదు ప్రకాశం పంతులు వంటి రాజకీయ నాయకులు, చివరకు మొఘల్ చక్రవర్తి వారసులు సైతం చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. మనకు అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే డబ్బు విషయంలో ఎలా జాగ్రత్తగా ఉండాలి, పొదుపు, పెట్టుబడి తదితర అంశాలను ఈ పుస్తకంలో వివరించానన్నారు. లక్ష్మీ కటాక్షం డబ్బు విషయంలో ఆలోచన రేకెత్తించే విధంగా ఉందని, మనీ మేనేజ్‌మెంట్ గురించి ఎన్నో విషయాలు ఉన్నాయని కెఎస్‌పి ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు సుబ్రమణ్య ప్రసాద్ తెలిపారు. పలువురు వక్తలు సైతం పుస్తకంపై తమ అభిప్రాయాలను వివరించారు.

క్యూరింగ్ చేసి అందుబాటులోకి తేవాలి

ఆల్విన్‌కాలని: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయి నగర్ వెస్ట్ కాలనీలో రూ.17 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, రఘు, ప్రవీణ్, రామరాజు, సంతోష్ బిరాదర్, ఉమేష్, సంతోష్, రాజుగౌడ్, కార్తిక్, వినీత్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



బ్యాగులు, నోటు పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: సున్నం చెరువులో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదల గుడిసెలను హైడ్రా అధికారులు తొలగించడంతో చిన్నారులు చదువుకునే నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు సైతం చెల్లా చెదురయ్యాయి. దీంతో సుమారు 20 మంది చిన్నారులకు పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగులు, పెన్నులను బుధవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కనీసం చిన్నారులను చూసైనా హైడ్రా అధికారులు వారి పాఠ్య పుస్తకాలను వదిలి వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ తిమ్మారెడ్డి, వీరారెడ్డి, నాయకులు నాగుల సత్యం, మల్లేషం, ఆవుల సంజీవ్‌పటేల్, పెసర విఠల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం



సన్మాన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తదితరులు



రమేష్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ రమేష్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వరరావు, డిప్యూటి డైరెక్టర్ వెటర్నరీ ఎస్. సందీప్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. సర్కిల్ కార్యాలయంలో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ఉద్యోగ విరమణ పొందిన ఏడీసీ బిన్‌రెడ్డి, ఎస్ శ్రీనివాస్‌ను పలువురు బుధవారం సన్మానించారు. డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగంలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయన్నారు.

మోతీనగర్: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పని సరి అని, ఎంత మందికి సేవ చేశామన్నదే ముఖ్యమని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి బి బ్లాక్ మాజీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ అన్నారు. మూసాపేట సర్కిల్ డిప్యూటి కమిషనర్ రమేష్, పట్టణ ప్రణాళిక అధికారి మల్లేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు.

ఆల్విన్‌కాలనీ: ఉద్యోగ విరమణ పొందిన అధికారులను మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ కమిషనర్ ఎక్కువ కాలం పని చేసి ప్రజలకు, అటు చిన్న స్థాయి అధికారుల నుంచి, పై స్థాయి అధికారులతో, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు.

మూసాపేట: అధికారులు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ అధికారులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, అరుణ్, అస్లాం, కిట్టు, రహూఫ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.500 బోనస్‌తో సన్న వడ్లు కొనుగోలు చేయాలి



సాక్షి, సిటీబ్యూరో: రేషన్ కార్డుదారులకు జనవరి–2025 నుంచి సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.500 అదనపు బోనస్‌తో సన్న వడ్లు కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో వర్షాకాలానికి సంబంధించిన ధాన్యం సేకరణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణ బాయి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రకళ, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు ధాన్యం సేకరణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు , రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముందుస్తుగా రైతులను తడి, తాలు, దుమ్ము లేకుండా తూర్పారబట్టి, ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చేలా చైతన్యం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరికోత సమయంలో వరినూర్పిడి యంత్రాల వారితో మాట్లాడి క్రమపద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో కొనుగోలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకే కేంద్రంలో సన్న, దొడ్డు రకం వడ్లకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. రైస్ మిల్లులకు కూడా వేర్వేరుగా ధాన్యాన్ని తరలించేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో నేరుగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేలా సంబంధిత అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు..

నియామకం

కూకట్‌పల్లి: జవహర్ బల్ మంచ్ నేషనల్ చైర్మన్ డాక్టర్ జి.వి. హరి తెలంగాణ రాష్ట్ర జవహర్ బల్ మంచ్ స్టేట్ కో ఆర్డినేటర్‌గా జిట్టా సునీల్ కుమార్ యాదవ్‌ను బుధవారం నియమించారు. అనంతరం సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తనకు బాధ్యతలను అప్పగించినందుకు డాక్టర్ జి.వి. హరికి, మహేష్‌కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రగతి చక్ర పురస్కారాలు అందజేత

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రగతి చక్ర పురస్కారాలను డిపో మేనేజర్ హరి అందజేశారు. సెప్టెంబర్ నెలలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన 10 మంది డ్రైవర్లు , 10 మంది కండక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ హరి మాట్లాడుతూ.. కూకట్‌పల్లి డిపో అభివృద్ధికి ఉద్యోగులంతా కృషి చేయాలన్నారు. మిగతా ఉద్యోగులు మరింత ఉత్సాహంతో వచ్చే నెలలో అవార్డులు పొందాలని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రగతి చక్ర పురస్కారాలను అందజేస్తున్న డీఎం హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత తదితరులు

పాఠశాలల్లో దీపావళి సంబురాలు



న్యూ ఎరా పాఠశాలలో..

ఆల్విన్‌కాలనీ: వివేకానంద్ నగర్‌లోని న్యూ ఎరా పాఠశాలలో బుధవారం దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి. నర్సరీ, ఎల్‌కేజీ విద్యార్థులు క్రాకర్స్, వివిధ వేషధారణలతో ర్యాంప్ వాక్ చేశారు. మొదటి తరగతి విద్యార్థులు నరకాసురవధ అనే నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం దీపావళి పాటలతో నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

పంచశీల స్కూల్‌లో..

మూసాపేట: మూసాపేట ప్రగతి నగర్‌లోని పంచశీల స్కూల్‌లో బుధవరం దీపావళి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు మట్టి ప్రమిదలు తీసుకువచ్చి వెలిగించి, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇప్పిస్తా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఐడీఎల్ చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రంగధాముని చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఎల్ చెరువు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు అభివృద్ధి పనుల్లో భూములు కోల్పోతున్న రైతులను పిలిచి.. వారికి తగిన నష్ట పరిహారం ప్రభుత్వం ద్వారా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కొంత కాలంగా తమ భూముల్లో నుంచి పైపులైన్ పనులకు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ పనులకు అడ్డు తగులుతున్న రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. సుమారు రూ.19 కోట్ల అంచనా వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతులు మీదుగా పనులు ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. కొంత మేర పనులు పెండింగ్‌లో ఉండటంతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఐడీఎల్ చెరువు పనులు పూర్తయితే చెరువు ప్రాంతం చుట్టు పక్కల వారికి ఆహ్లాదంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, వ్యాయామం చేసుకునేందుకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. పనులు త్వరగా పూర్తి అయ్యేందుకు స్థానికులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మున్సిపల్, ఇరిగేషన్, హుడా విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ

కూకట్‌పల్లి: బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని వివేకనగర్ బీఆర్ఎస్ నాయకురాలు లలిత మాతృమూర్తి గౌతమ్ న్యూరో కేర్ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణారావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ ఉన్నారు.

అధికారుల సేవలు అభినందనీయం

కూకట్‌పల్లి: విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేసి ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ 23 ఉప కమిషనర్ రమేష్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వరరావులు ఈ నెల 31న ఉద్యోగ విరమణ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ కృష్ణయ్య, మాజీ కార్పొరేటర్ బాబూరావు, నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందుతున్న మూసాపేట సర్కిల్ 23 ఉప కమిషనర్ రమేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న శ్రీనివాస్ యాదవ్ తదితరులు

మోతీనగర్: ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీలో సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా స్వీకరిస్తున్నారని బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్, యూసుఫ్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లలో ఇంటింటికీ తిరిగి బీజేపీ సభ్యత్వాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు అండగా ఉండాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను హైడ్రా పేరుతో భయపెడుతోందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు విజయ్, నాయకులు పూజారామ్, సాయి చంద్, శ్రవణ్, రవి యాదవ్, మనోజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF 6th ADDITIONAL DISTRICT JUDGE, KRISHNA AT MACHILIPATNAM
O.S. No. 8/2023
Between:
Kambhampati Padmaja Kumari & others ... Plaintiffs
AND
Sugnanam Satyanarayana Murthi & others ... Defendants
To,
Nadimpalli Prudviraj S/o Rangaraju, Plat No.289/A, Flat No.101, Venkata Sai Nilayam, Kukatapalli, near HMT Hills community hall, Hyderabad. Telangana State. ... 11th Defendant
Please take notice that the above matter has been posted to 05-11-2024 for your appear before the above court either personally or through advocate, to canvass your objections in the above referred to suit. Otherwise the matter will be decided in your absence.
(As per court orders)
Bantumilli 30-10-2024
Sannala Brahmaji
Advocate
Bantumilli